డ్యూటీలోవున్నా మనసుమాత్రం యిరవైనాలుగు గంటలూ డ్యూటీలోనే వుంటుంది. ఆమధ్య వోసారి వేమయ్యకు వో చిన్న వార్నింగ్ తగిలింది. అదేమంత పెద్దవిశేషంకాదులేండి. వుద్యోగమన్నాక అంతమాత్రం పొరపాట్లు లేకుండా ఎలా వుంటుందీ? ఇంతకి వేమయ్య వోసారి, లైసెన్సు లేకుండా వీధిలో తిరుగుతూందన్న కారణాన, మంత్రిగారి పెంపుడు కుక్కను అమాంతం అరెస్టుచేసి ఇరవైనాలుగు గంటలు రిమాండులో వుంచాట్ట! ఇంకోసారి ఛైర్మన్‌గారి కారు ఆపి ముందోస్తూన్న దున్నపోతుబండిని పోనిచ్చాడట! ఇలాంటివి వొకటీ రెండూ జరగబట్టే ఎప్పుడో రావాల్సిన ప్రమోషన్‌కు యింతవరకూ ఆలస్యం జరిగింది.

ఏమైనా, వేమయ్య తెలివితేటల్ను, పై అధికారులు గుర్తించడంలో కొంత అలస్యం జరిగినా అసలు గుర్తించడం జరిగింది. ఈ మధ్యనే వేమయ్యకు సూచాయగా తెలిసింది - తన్ను యింటలిజన్సు బ్రాంచీలోకి మార్చాలనే ప్రయత్నాలు జరుగుతూన్నట్టు. అందులో అసలు రహస్యం ఇంకోటుంది - సి. ఐ. డి. బ్రాంచీలో వేమయ్యకు ఇనస్పెక్టర్ పోస్టే యివ్వాలనట అధికారుల ఆలోచనలు. అందుకే ముందు హెడ్‌కానిస్టేబులుగా ప్రమోషన్ చేయడం జరిగిందట. అదంతా వేమయ్య మనసులో దాచుకొన్న సంగతి; మనకెందుకులేండి.

గోవిందయ్య బ్యాంకి కుట్రకేసూ, వైస్ ప్రెసిడెంటు ఖూనీకేసుల్లో వేమయ్యకు న్యాయంగా దక్కాల్సినంత కీర్తి దక్కలేదు. అహోరాత్రాలూ కష్టపడి కూపీలు తీశాడు.

వేమయ్యలాంటివాళ్ళు కింద లేకపోతే ఆ సెక్షన్ సబ్ యిన స్పెక్టరుకూ, సర్కిల్ ఇనస్పెక్టరుకూ ప్రమోషన్‌లు వచ్చి వుండేవికావు. ఇంతకీ చెప్పొచ్చేదేమంటే వేమయ్యకు అంత తొందర్లోనే ప్రమోషన్ యివ్వడంవల్ల అధికారులు చూపిం చిన ప్రత్యేకతగానీ పక్షపాతంగానీ ఏమీలేదని. న్యాయంగా వేమయ్య తెలివి తేటల్నీ శక్తిసామర్థ్యాల్నీబట్టయితే సరా సరి ఇనస్పెక్టరు వుద్యోగమే ఇచ్చేయొచ్చు! వేమయ్యకు చురుకుతనమే కాకుండా కరుకుతనంకూడావుంది. వేమయ్య కున్న మేధాసంపద, కార్యదీక్ష, ధైర్యసాహసాలు, డిటెక్టివ్ స్పిరిటూ ఏ పోలీసు ఇనస్పెక్టరు జనరల్‌కో వుంటే, ఈపాటికి దేశంలోవున్న 'అవారా'గాళ్ళంతా హాలీవుడ్‌కు ప్రయాణం కట్టేసివుందురు!

అసలు వేమయ్య యింతమంది దొంగల్ని పట్టు కోటంలోను, అన్ని నేరాల్నీ కూపీ తీయడంలోనూ ఏదో వొక కిటుకు లేకపోలేదు. చీకటిపడ్డేసరి వేమయ్య అంతు దొరకడు. ఏ సినిమాహాలు దగ్గరకో, రైల్వే స్టేషన్‌కో, సత్రం అరుగులమీదకో, పార్కులోకో చేర్తాడు. తెల్లారిపాటికి వో కేసు లంకించుకుంటాడు. కాని, హెడ్ కానిస్టేబులుగా ప్రమోషనొచ్చి మూడురోజు లైనప్పటికీ యింతవరకూ వో కేసయినా పట్టుకోలేకపోయాననే బాధ స్టేషన్ ప్లాట్‌ఫారం మీంద ముడుచుకొని పండుకొన్న వేమయ్య హృదయాన్ని వేధిస్తూంది. తెల్లవారేసరికల్లా ఏదోవొహటి చేసేయాలనే కోర్కె అతని బుర్రలో దూరి మెదడుకు దురదకలిగిస్తూంది

చెప్పొద్దూ, వేమయ్య చేతులుకూడా కొద్దిగా గులగుల్లాడక పోలేదు.

ఎవడూ దొరక్కపోతే కనీసం బియ్యపు మూటల వాళ్ళనన్నా పట్టుకుందాంలే అనుకొన్నాడు. కాని ఆ పని హెడ్ కానిస్టేబుల్ వేమయ్య హోదాకు తగిందికాదను కొన్నాడు. ఏమైనా ఈ రాత్రికి రాత్రే ఏదోవొక పెద్ద కేసు పట్టుకొని హెడ్ కానిస్టేబుల్‌గా పదిమంది దృష్టిలో పడాలనే ఆలోచనలో పడిపోయాడు వేమయ్య.

అలా అలోచిస్తూ రైల్వే ప్లాట్‌ఫారం మీదున్న సిమెంటు బెంచిపై, పైగుడ్డపరచుకొని పండుకొన్న వేమయ్య, మోకాళ్ళు పొట్టలోకి ముడుచుకొన్నాడు. రకరకాల మను షుల రక్తం తాగి తెగబలిసిన సదరన్ ఇండియా రైల్వే తాలూకు నల్లులు వేమయ్యను చిటుకు పోటుకునా అంట పొడిచేస్తున్నయ్. డి. డి. టి. కంపెనీ వారి ప్రచారధాటికి తట్టకోలేక, చనిపోగా మిగిలిన దోమలు పారిపోయి వచ్చి వేమయ్య ఎడంచెవిలో లతామంగేష్కర్ ప్లేబాక్ సంగీ తాన్ని అలాపిస్తూన్నయ్.

వేమయ్య పండుకొన్న బెంచీకి వెనుకగా గుడ్డల బేళ్ళూ, కోళ్ళబుట్టలూ వరుసగా పేర్చివున్నయ్. వాటికాను కొని యిద్దరు పోర్టర్లు కునికిపాట్లు పడుతూవున్నారు. మధ్య మధ్య టీ కుర్రాడు; 'టి గరం చా' అంటూ, అటూ యిటూ తిరుగుతూ వున్నాడు. ఒంటిగంటా ఐదునిముషా లకు రావాల్సిన కలకత్తామెయిలు వచ్చి వెళ్ళిపోయింది. ప్రయాణీకుల్లో చాలామంది వూళ్ళోకి వెళ్ళిపోయారు.

మిగతావాళ్ళల్లో కొంతమంది 'వెయిటింగ్ రూం'లోకి వెళ్ళిపోయారు. నలుగురో అయిదుగురో ప్లాటుఫారం మీదే పక్కలు పరుచుకొని పండుకొన్నారు. వోయిద్దరు గుడ్డల బేళ్ళ పైకెక్కి నడుంవాల్చారు. ఇంకో యిద్దరు ఏ బెంచీ అయినా కాళీవుందేమోనని వెతుకుతూ వున్నారు. అలా తిరుగుతూన్న వాళ్ళను వేమయ్య మోహంమీదకు ముడుచుకున్న మోచేయి సందుగా తొంగి తొంగి చూస్తూన్నాడు.

పిండార బోసినట్లు వెన్నెల కురుస్తోంది. పరుగెత్తుతూన్న నల్లటి మబ్బులు చందమామతో దాగుడుమూతలాడుతున్నాయ్. వుండుండీ చీకటి తెరలు స్టేషన్‌పై వాలి మరోక్షణంలోనే తొలిగిపోతున్నాయ్. చల్లటిగాలి హోరున వీస్తూంది. స్టేషన్‌కు ఎదురుగా, అరణ్యంలా అల్లుకుపోయిన తుప్పపొదలు వెన్నెల్లో మెరిసిపోతూ, చల్లటిగాలికి విచిత్రంగా ఆడుతూ పాడుతూ తన్మయత్వం పొందుతున్నవా అనిపిస్తూంది!

స్టేషన్‌లో వున్న రిసీవర్ — 'కట్‌కడ; కడకట్' అంటూ మార్స్‌కోడ్ బాదేస్తూంది. మధ్యమధ్య స్టేషన్ మాష్టరు బయటికొచ్చి వరండాలో నుంచొని కాసేపు అటూ, ఇటూ చూసిపోతూన్నాడు. ప్రయాణీకు డెవరో, అడిగిన ప్రశ్నకు సమాధానంగా స్టేషన్ మాష్టరు మద్రాసు ప్యాసింజరు అరగంట లేటని చెప్తూన్నాడు. ఆ బండికి పోయేవాళ్లు కాబోలు స్టేషన్‌లోకి వాకొక్కళ్ళు చేరుకుంటూన్నారు.

వేమయ్యా తన చేతికున్న రేడియం డయల్ వాచీ చూసుకొన్నాడు. ఒకటిన్నరయింది. రెండింటికి రావాల్సిన మద్రాసు ప్యాసింజరు అరగంట లేటయింది. కాబట్టి ఇంకా వోగంట సేపటిగ్గాని రాదు. అంతసేపూ పక్కలు వత్తుకుపోతూ ఈ సిమెంట్ బల్లమీదే పండుకోవాలి గామాలు! ఇంత కష్టపడ్డా ఏదైనా కేసు దొరుకుతుందో లేదో? వేమయ్యా బుర్రలో అలా నిలువునా లేచి నుంచున్న అనుమానాన్ని, అతని అనుభవం పైకొచ్చి అడ్డంగా పడగొట్టింది. ఆ బెంచీ మీద పండుకునే. తను పోయిన మూణ్ణెల్లలో ఐదు కేసులు పట్టుకొన్నాడు. ఆ మాటకొస్తే గోవిందయ్యా బ్యాంకీ కుట్ర కేసుకు సంబంధించిన 'క్లూ' దొరికింది ఆ బెంచిమీదనే కదూ!

ఆరడుగుల పొడవూ, రెండడుగుల వెడల్పూవున్న ఆ సిమెంటుబల్లకు వెల్లికిలా పండుకొన్న వేమయ్యా శరీరం సరిపోయింది. అజానుబాహుడైన వేమయ్యను కాఖీ యూనిఫారంలో వుండగా వోసారి చూడడం జరిగితే, మళ్ళీ జన్మలో మరిచి పోవడం అనేది జరగదు. వేమయ్యా ఎముక పుష్టేగాక కండపుష్టిగల మనిషి. వేమయ్యా ఛాతీమీద, మెడ కిందా, గవదలమీద పెరిగిన కండల్ను చూస్తే దేశంలో ఆరు అవున్సుల రేషన్ ఆధ్యాత్మిక వాదంతో బతుకు తున్నారనే ప్రచారం వట్టి గోబెల్సు ప్రచారమే అవుతుంది! ఏమైనా, వేమయ్యా దేహాన్ని గురించి ఆడిపోసుకోటం అతని పుష్కలమైన శరీరాన్నిచూసి వోర్వలేక పోవడమే కాగలదు. అయినా, ఇందులో వేమయ్యా వొకర్ని అన్యాయంచేసిం

దేమీ లేదు. ఆ కండలూ, ఎముకలూ — శరీరం అతని స్వార్జితం. ఒంటూపిరిగాళ్ళు వేమయ్య దేహాన్ని చూసి అసూయపడ్డం మినహా చేయగలిగిందేమీ లేదు. కాల ఖర్మ వశాత్తూ వేమయ్య చేతుల్లోపడి అతని ఎముకలు తాలూకు గట్టితనాన్ని, కండల వాడుపునూ, శరీరపు పటుత్వాన్ని చవి చూడలేక పోవడం ఓ పెద్ద దురదృష్టమే అనాలి!

రైల్వే ఫాటుఫారంమీాద సిమెంట్ బల్లపై పండు కొన్న వేమయ్య మనసులోని వ్యధనూ, అతని మెదడులోని ఆలోచనలనూ, అలా వేమయ్యపాటికే వదిలేసి; అతని శరీర సౌష్టవాన్ని, మెలిదిరిగిన కండల్నూ, చిలవలు పలవలుగా వర్ణించి చెప్పుకోడం హెడ్ కానిస్టేబులుగా ప్రమోటయిన వేమయ్యను చిన్నచూపు చూట్టమే అవుతుంది. కాకపోతే భవిష్యత్తులో వేమయ్య, చేతులో పడమనే నమ్మకం, ధైర్యం మీాకూ, నాకూ వుండనన్నా వుండాలి.

అట్లాపోయి స్టేషన్ పక్కనేవున్న 'టీ' స్టాల్లో వోకప్పు 'గరంఛా' తాగేసివస్తే బాగుంటుందనిపించింది వేమయ్యకు. నిద్రకాగలేక కళ్ళు మూతలు పడిపోతున్నాయి. యివ్వాళ టీ తాక్కపోతే లాభం లేదనిపించింది. ఎందుకంటె ఆ మధ్య వోకటీ రెండుసార్లు అలానే వళ్లు మరచి ఫ్లాటుఫారం మీాదే తెల్లారి బారెడు పొద్దెక్కేందాకా నిద్రపోవడం జరిగింది! వేమయ్య లాంటివాడు అక్కడ నిద్ర పోతోండగానే రైళ్ళు రావడం, పోవడం, వైటింగ్ రూంలో ట్రంకుపెట్టెలు మాయమవడమూ జరిగింది! చెప్పకూడదుగాని ఆరోజున పోర్టరొచ్చి లేపిందాకా వేమయ్య తన తలకిందవున్న టర్కీ

టవలు గల్లంతయింది కూడా చూసుకోలేదు పాపం! అప్పట్నుంచీ వేమయ్యా పగపట్టి తిరుగుతున్నాడంటే నమ్మండి! దేనికైనా కాలం కలిసిరావాలిగా!

వేమయ్యా స్థూలదేహం సిమెంటుబల్లకు ఎడాపెడా వొరుచుకొంది. వేమయ్యా లేచి కూర్చొని బద్ధకంగా వళ్ళు విరుచుకుంటూ ఆవలించాడు. అలా తెరిచిననోరు తెరిచినట్టే వోక్షణకాలంపాటు వుండిపోయింది! మూసుకుపోతున్న వేమయ్యా కళ్లు జిగేల్ మన్నాయి! వేమయ్యా శరీరానికి అంటిపెట్టుకొన్న మత్తు మంచులా కరిగిపోయింది! ఎక్కడ లేని సత్తువా, వుత్సాహం నరాల్లోకి వచ్చేసింది. వందకప్పుల టీ తాగినా, గ్యాలన్ సారా తాగినా ఎక్కనికైపు వుద్రేకం వేమయ్యా రక్తనాళాల్లో ప్రవహించింది!

వేమయ్యా దృష్టి 'వెయిటింగ్‌రూం'కు కుడిపక్కగా చెట్టుకింద వెన్నెల నీడలో నుంచున్న యిద్దరు వ్యక్తులపై పడింది. పాతిక సంవత్సరాల వయస్సులో, బొద్దుగా యెర్రగా వున్న యువతీ, దాదాపు అంతే వయసులో పొడుగ్గా సన్నగా చామన చాయగావున్న యువకుడూ నుంచొని మెల్లగా మాట్లాడుకొంటూ న్నారు. మాట్లాడుతూ, యువకుడు మధ్య మధ్య అటూ యిటూ చూస్తున్నాడు. ఆ యువతి అప్పుడప్పుడూ తన చేతిలోవున్న లెదర్ సూట్‌కేసును చూసుకొంటూ వుంది. ఆమె చేతిలోవున్న నల్లటి తోలుపెట్టె చెట్టు వెన్నెలనీడల్లో మెరుస్తోంది!

అయితే, దేవాంతకుడు వేమయ్యా కళ్ళు ఆ నుంచున్న యిద్దరు వ్యక్తులూ, ఆమె చేతిలోని సూట్‌కేసును చూడ్డం

తోనే సంతృప్తిపడలేదు. గుడ్డల బేళ్ళచాటునుంచీ ఆమె చేతిలోని తోలుపెట్టెను తొంగి తొంగి చూస్తూన్న వొక వ్యక్తిని వేమయ్య కళ్ళు పసిగట్టేసినై. ముందే చెప్పానుగా వేమయ్యవి డేగకళ్ళని!

వేమయ్య ఆ సిమెంటు బల్లమీదే కూర్చొని తదేక దీక్షగా — ఆ ప్రయాణీకుల్నిద్దర్నీ, వాళ్ళవెనకే, నీడల్లో పొంచి వుండి నిక్కినిక్కి చూస్తూన్నవాడ్నీ — చూస్తూ వున్నాడు.

వేమయ్య మనసుకు అప్పుడే దొంగ దొరికిపోయి నట్టనిపించింది. ఆమాట నిజమేను; వేమయ్య కళ్ళల్లో పడ్డ దొంగ యెవడు తప్పుకుని బయటపడ్డాడు గనుక.

వేమయ్యకు గుర్తుకురాలేకపోలేదు, క్రిందటినెల్లో వెయిటింగ్ రూంలోనే జరిగిన పెట్టెలదొంగతనం. వేమయ్య మనసు కొండంత ఆశతో మేలుకుని కూర్చొనివుంది!

ఆ యువకుడు బండి టైం కనుక్కోటానికి స్టేషన్ మాష్టరు గదిలోకి వెళ్ళాడు. ఆమె వెయిటింగ్ రూంలోకి పోయి కూర్చుంది.

అతను కొంచెంసేపట్లో తిరిగివొచ్చి మళ్ళీ ఆ చెట్టు కిందే నుంచున్నాడు. ఆమె కూడా అతని దగ్గరకొచ్చి ఆదుర్దాగా అడిగింది—

"బండి వస్తూందా?"

"అరగంట లేటు! ఎట్లాలేదన్నా యింకా వొకగంట కాని రాదు."

"అంతసేపూ యిక్కడ ఎలా వుండేది?" నిరాశగా అంది.

"ముసలమ్మ సరిగా చేరిందో లేదో"

"నాకూ అదే అనుమానం!" ఎడంచేతిలోని పెట్టె కుడిచేతిలోనికి మార్చుకొంటూ మెల్లిగా అంది. అంతవరకూ గుడ్డలబేళ్ళ చాటునవున్న వ్యక్తి బయటకొచ్చి చెట్టుపక్కగా నుంచోని వాళ్ళ సంభాషణ వింటూన్నాడు. ఇదంతా సిమెంట్ బల్లమీద కూర్చున్న వేమయ్య చూస్తూనే వున్నాడు.

ఇంకా గంట టైంవుంది; యీ లోపల ముసలమ్మే మైందో చూసొస్తాను."

"తొందరగా రావాలి! నాకు భయంగా వుంది!"

"ఇప్పుడే వస్తా; అందాకా నువ్వు వెయిటింగ్‌రూంలో కూర్చో! అంతగా అవసరమైతే నువ్వుకూడా వచ్చేసెయ్!" అని చెప్పి అతను స్టేషన్‌లోనుంచి వెళ్ళి పోయాడు, వెళ్తూన్న అతన్ని దీక్షగా చూస్తూ ఆమె వెయిటింగ్‌రూం ముందు నుంచోనివుంది.

అందాకా చెట్టుచాటున పొంచివున్న వ్యక్తి బయటి కొచ్చి ఆమెకు దగ్గరగావున్న స్తంభానికి ఆనుకొని ఆమెను పక్కవాటుగా చూస్తూ నుంచున్నాడు.

తనముందు అలా తారట్లాడుతూన్న అతన్ని గమ నించినట్టుందేమో వెంటనే ఆమె వెయిటింగ్‌రూంలోకి వెళ్ళి పోయింది. అతను ఆ గదిముందే అటూ యిటూ తిరుగు తున్నాడు. తెల్లటి ఫొట్టిచొక్కా, పైజమా వేసుకొని వున్నాడు. పైనున్న టవల్‌తో ముఖం తుడుచుకుంటూన్నట్టు నటిస్తూ మొఖం దాచుకొని వంగి వంగి గదిలోకి తొంగి

చూస్తూవున్నాడు. రెప్పవేయకుండా వేమయ్య వాడి వాలకం చూస్తూనేవున్నాడు. కొంతసేపు వాడు ఆ వరండాలో అటూ యిటూ తిరిగాక వెయిటింగ్‌రూంలో జొరబడ్డాడు.

అంతవరకూ సిమెంట్ బల్లమీద కూర్చొని చూస్తూన్న వేమయ్య బిళ్ళంగోడులా లేచి నుంచొన్నాడు. చొక్కాకింద జారిపోతూన్న పొట్టి లాగును పైకి లాక్కొని వూడిపోతోన్న బెల్టుని బిగించుకొన్నాడు. పైనున్న టవల్ను తలమీదుగాతీసి చెంపల మీదుగా కప్పుకొంటూ గబగబా వచ్చి వెయిటింగ్‌రూం గోడపక్కన నక్కాడు. మెల్లగా తల ముందుకు చాపి గదిలోకి తొంగిచూశాడు.

ఆమె బల్లమీద కూర్చొనివుంది. పెట్టె తన వెనగ్గా పెట్టుకొని దానిమీదుగా వాలి గోడకు ఆనుకొని కూర్చొంది ఆమె వెనగ్గా కొద్దిగా కనపడ్తూన్న పెట్టెనూ, ఆమెనూ, వోరగా చూస్తూ వాడు ఎదురుగావున్న కుర్చీలో కూర్చొని వున్నాడు. ఇంకెవరో యిద్దరు ప్రయాణీకులు వాలుకుర్చీల్లో పండుకొని కాళ్ళు బల్లమీద వేసి గుర్రుపెట్టి నిద్రపోతున్నారు.

వాడు ఆమెతో మాట్లాడాలనే ప్రయత్నంలో కుర్చీలో అటూ ఇటూ కదుల్తూ ఆమెవంకే చూస్తూన్నాడు, ఆమె వాడివంక చూస్తూన్నప్పుడు మాత్రం ఏమీ తెలీనట్టే కిటికీలోగుండా బయటికి చూస్తూవుంది.

గది బయట గోడపక్కన పొంచివున్న వేమయ్య వూపిరికూడా నిశ్శబ్దంగా పీల్చి వదుల్తున్నాడు; మాంచి పకడ్‌బందీగా కాచుకూర్చున్నాడు. ఇంకేముంది, దొంగ దొరికిపోయినట్టే అనుకున్నాడు. అంతగాక యింకేముంది లేండి! హెడ్‌కానిస్టేబులు వేమయ్యలాంటివాడు బయట

కాచుకొని వుండగా వాడింకెక్కడికి పోతాడు? అసలు వాడా గదిలోకి జొరబట్టమంటే. ఎలుక బోనులో దూరినట్టేగదూ! వాడా పెట్టె నంటుకోటం అంటే వేమయ్య గాలానికి తగులుకోట మన్నమాటే!

అయితే అక్కడే వచ్చింది చిక్కు వేమయ్యకు! పెద్ద మనిషిలా వాడి వేషమూ వాడూనూ, ఏదో ప్రయాణీకుడిలా ప్రవర్తించి ఆమెను మోసంచేసే ప్రయత్నంలో వున్నాడు. అలాంటి ఘరానా దొంగల్ని చాలామందిని చూసిన వేమయ్యకే వాడు పెద్ద తరగతి దొంగలా కనపడ్డాడు. మామూలువాళ్ళయితే వాడివేషం అది చూసి యిట్టే మోసపోతారు. అయితే వేమయ్య వాడిచూపులోనే కనిపెట్టేశాడు. ఎత్తైనచిన్న నొసలూ, చీకిరికళ్ళూ, చట్టిముక్కూ వాడూ. వాడిమొహం అచ్చగా దొంగ మొహంలానే కనిపించింది వేమయ్యకు. వాడిచూపూ వాడూ అచ్చగా దొంగ చూపేను. ఏమైనా వాడు కాస్త తెలివి తేటలున్న దొంగ వెధవేనని మనసులో అనుకొన్నాడు వేమయ్య. అసలందుకే కదూ అంత జాగ్రత్తగా వుండటం! అయినా వాడెంత వాడైనా వాడి పాచికలేమీ తనముందు పారవని వేమయ్యకు క్షుణ్ణంగా తెలుసు.

లోపల వాడేంచేస్తున్నాడోనని వుండబట్టలేక తొంగి చూశాడు వేమయ్య. వాడు కుర్చీలో ముందుకువంగి ఆమె నేదో ప్రశ్నిస్తున్నాడు. ఆమె బెరుకు బెరుగ్గా సమాధానమిస్తూంది. వేమయ్య చెవుల్ని గోడకానించి శ్రద్ధగా వింటున్నాడు. అందుకే ముందే చెప్పాను, వేమయ్యవి పాము చెవులని!

"ఎక్కడికి వెళ్తున్నారు?"—అతను అడిగాడు.

"మద్రాసు!"—అని ఆమె చెప్పింది.

"ఇందాక మీతో పాటున్న వారెవరు?"

"మావారే!"

"ఎక్కడికి వెళ్ళారు?"

"వూళ్లోకి."

"ఎందుకు?"

"పనుండి."

అక్కడికే వేమయ్యకు ఆమెమీద కోపం ముంచుకొచ్చింది. వాడడిగిన దానికల్లా ఆమె అలా సమాధానం చెప్పడం వేమయ్యకేమీ బాగా లేదు. ప్రతి దొంగవెధవా అడిగే అడ్డమైనా ప్రశ్నలన్నిటికి యిలానే జవాబు చెప్పి పీకలమీదకు తెచ్చుకుంటారు యీ ఆడాళ్ళు! వాడేమో వీళ్ళసంగతంతా తెలుసుకొని ఆ ఎత్తుకు పోయేదికాస్తా గుట్టు చక్కంగా ఎత్తుకుపోతాడు. పోతే చావొచ్చేది. తనకు; వీళ్ళందర్నీ వెతికి పట్టుకోలేక.

అంతలోనే ఆ యువతి వెయిటింగ్ రూంలోంచి బయటికొచ్చి స్టేషన్‌లోనుంచి చరచరా వెళ్ళిపోయింది. ఆ దొంగాడు కొంచెం ఆలస్యంగా గదిలోనుంచి బయటికొచ్చి అటూ ఇటూ చూసి, వెళ్తున ఆమెను వెంబడించాడు.

అందాకా పోర్టరులా పోజులేసి గోడ కానుకొని కునికిపాట్లు పడ్తూనట్లు నటిస్తూన్న వేమయ్య లేచి నుంచొని వాళ్ళిద్దరి వెనగ్గా నడుస్తూన్నాడు.

ఆమె స్టేషన్‌రోడ్డు మలుపు తిరిగింది. అతనూ తిరిగాడు. కీసీడలో వేమయ్యా అదేమలుపు తిరిగాడు. స్టేషన్ రోడ్డుమీద వున్న ఎలక్ట్రిక్ దీపాలకాంతి ఆ వీధి మొదట్లో కొంతవరకూ పడ్తూన్నా, పోను పోను ఆ వీధంతా చీకటిగా వుంది. ముందు పోతూన్న ఆమె, ఆమె వెంటబడి నడుస్తూన్నవాడూ, ఆ చీకట్లో కలిసిపోయి వేమయ్యా వేగం హెచ్చించాడు. కళ్ళు తెరిచే వేమయ్య చీకట్లోకి నడుస్తూన్నాడు! వేమయ్య కాళ్ళవేగం యెక్కువగా వుందో గుండెల వేగమే యెక్కువగా వుందో మరి వేమయ్యకే తెలియాలి!

ఆ యువతి ఆ వీధినుండి మరొక సందుకు తిరిగి సత్తువకొద్దీ పరుగెత్తుతూంది! ఆమెను వెంబడిస్తూన్న అతడు మునిస్పాలిటీ లైట్ దగ్గర కొచ్చేసరికి ఆ యువతిని పట్టుకొన్నాడు! ఆమె చేతిలోవున్న సూట్ కేసును లాక్కోడానికి ప్రయత్నిస్తూన్నాడు. ఆమె పెనగులాడుతూంది. వాడామెను బలవంతం చేస్తున్నాడు. అది చూసేసరికి వేమయ్యకు వళ్ళు మండిపోయింది! దుర్మార్గుడు! ఎంత సాహసం చేస్తున్నాడు! వేమయ్య వొక్కదూకుతో అక్కడికి వచ్చేశాడు. అప్పటికే వాడు ఆమె చేతుల్లోంచి సూట్‌కేసు లాక్కున్నాడు. వేమయ్య వెనగ్గా వెళ్ళి, వాడ్ని మెడజీవలమీద వొక్కతీత తీశాడు! అకస్మాత్తుగా తగిలిన ఆ దెబ్బకు దిమ్మరపోయి వాడు వెనక్కు తిరిగాడు. అలా తిరుగుతూన్న వాడి మొహమ్మీద— హాలివుడ్ సినిమాలోలా —'పటాపట్ —'వో అరడజనుపోట్లు పొడిచాడు! వాడిగడ్డం, నోరూ, ముక్కూ, చంపలూ్నా, నొసలూ్నా కలిపి పుట్టిపాతర్లా చదునుచేశాడు!

చలిమిడి ముద్దలా సాగిపోతూన్న ముఖంతో, తోటకూర కాడలా వేలబడిపోయాడు మనిషి! వేమయ్య మొహంలోకి అదోలా చూస్తూ ఏదో అనబోయాడు. అయితే వేమయ్య మూడుమీద కొట్టినదెబ్బకు పళ్ళ సందుకు వచ్చిన నాలుక అక్కడే గట్టిగా కరుచుకు పోయింది! నోట్లోనుంచి రక్తం కార్తూండగా వాడు స్పృహతప్పి పడిపోయాడు.

అంతవరకూ, గాభరాతో దూరంగా నుంచొన్న ఆ యువతిని పిల్చి సూట్ కేసు వాడి కుడిచేతులోంచి లాగి యిచ్చేశాడు. బండివచ్చే టైం అవుతుందని చెప్పి ఆమె సూట్ కేసు తీసుకొని వెళ్లే ప్రయత్నంలో వుంది.

భయంతో మునిగిపోయివున్న ఆమెకు ధైర్యం చెప్పాడు. అలా వొంటరిగా ఎక్కడికీ పోవద్దని సలహా యిచ్చాడు. కృతజ్ఞతతో చూస్తూన్న ఆమెనుచూసి వేమయ్య "దయచేసి మీ అడ్రసు యివ్వండీ!" అన్నాడు. అడ్రసు అడిగేసరికి వేమయ్యకేసి ఆమె అనుమానంగా చూసింది. అది గ్రహించిన వేమయ్య తను హెడ్ కాని స్టేబుల్నని చెప్పి సూట్ కేసుకు అంటించివున్న అడ్రసు కార్డును తీసుకొని, వోరీతిగా మాట్లాడి ఆమెను స్టేషన్‌కు పంపించి వేశాడు. ఇంకో రీతిలో స్పృహతప్పి పడి పోయి వున్న వాడ్ని పోలీస్టేషన్‌కు చేర్చాడు.

ఆ రాత్రి లాకప్‌లో—వాడికి స్పృహ వచ్చాక వేమయ్య 'ట్రీట్ మెంటు' యిచ్చాడు. 'ట్రీట్ మెంటు' ఇవ్వ డానికి వేమయ్య ఏమైనా డాక్టరా అన్న సందేహం కల గొచ్చు మీకెవరికైనా. వేమయ్య ఫిజియాలజీ, పుస్తకాల్లో చదువుకోక పోయినా అనుభవంలో నేర్చుకొన్నాడు.

ఎముకల్లో సున్నం యెంత భాగముందీ, పక్క ఎముకల గట్టితనాన్ని గురించీ క్షుణ్ణంగా తెలుసుకొన్నాడు. కీళ్ళ కదలికల్ను గురించి శాస్త్రజ్ఞులు చెప్పిందాన్ని తప్పని ఋజువు చేశాడు, ఇంతకీ వేమయ్య పరిభాషలో ట్రీట్‌మెంట్ అంటే అర్థం వేరు. ఎంత లావాడినైనా దొంగనని యిట్టే వొప్పించడం !

ఆ రాత్రి వేమయ్య వాడ్ని లాకప్‌లో వుంచి యింటికి తిరిగొచ్చాడు. ఇంటి కొచ్చేసరికి దాదాపు మూడుగంట లవుతూంది. అయినా, వేమయ్య హాయిగా, సంతృప్తిగా నిద్రపోయాడు.

ఉదయాన్నే లేచి యూనిఫారం వేసుకొన్నాడు. వేమయ్య మాంచి హుషారుగా వున్నాడు. కాదుమరీ; రాత్రి తను పట్టుకొన్నది సామాన్యమైన కేసా ? రాత్రి తను తెచ్చిన సూట్‌కేసు తాలూకు అడ్రసుకార్డు తీసి చదువుకొన్నాడు. చదువుతూనే వళ్లు తెలియని ఆనందం ఆశ్చర్యంలో మునిగి పోయాడు. కళ్ళు వోసారి గట్టిగా నలుపుకుని మళ్ళీ చూశాడు. రాత్రి తను రక్షించింది వొక సామాన్యురాల్ని కాదు ! ఈ దెబ్బతో తుదకు యినస్పెక్టరుగా ప్రమోషన్ తప్పదు. వేమయ్య అదృష్టం పండింది ! వెదకబోయిన తీగ కాళ్ళ కడ్డంపడ్డది.

గబగబా డ్రస్సుచేసుకొని హెడ్‌కాన్‌స్టేబుల్ గుర్తుగల పోలీసుబుట్ట నెత్తినపెట్టుకున్నాడు. ఎన్నిరోజులున్నించో నెత్తినపెట్టుకుంటూన్న బుట్ట :యీ రోజు ఎందుకో మరి అసహ్యంగా కనిపించింది. ఏవగింపుగానే టోపి నెత్తిన పెట్టుకొన్నాడు. ఇంతకీ వేమయ్య మనస్సు. యినస్పెక్టరు పెట్టుకునే

హేట్ మీదకుపోయింది. నిజంగా అది పెట్టుకొంటే తనెంత అందంగా వుంటాడు! ఎంత ఠీవి ఎంత హుందాతనం వుంది అందులో! ఏమైనా యీ కేసులో తనకు ప్రమోషన్ తప్పదు, ఈ బుట్టకు బదులు హేట్ తన తలను అలంకరించే యోగం వుంది. తనకు రాబోయే ప్రమోషన్ తాలూకు వూహల్తో పోలీసుబుట్టకింద వున్న వేమయ్య తల వేడెక్కి-పోతూవుంటే, తారోడ్డుమీద ఠీవిగానడుస్తున్న వేమయ్య కాళ్ళు సరాసరి పోలీస్ స్టేషన్‌లోకొచ్చి వొక్కసారిగా గట్టిగా శబ్దంచేసి టక్కున ఆగిపోయినై! వేమయ్య కుడిచేయి కణ తలదాకా లేచి సాల్యూట్ కొట్టింది, అయితే యింతకీ వేమయ్య సాల్యూట్ కొట్టిందెవరికి? అది వేమయ్యకే సరిగా తెలియదు. వేమయ్య మెదడు నమ్మలేని వో విషయాన్ని అతని కళ్ళు చూస్తూవున్నయ్! ఎదురుగా, టేబుల్ వెనక కుర్చీలో రాత్రి తను పట్టుకొచ్చిన దొంగాడు కూర్చొని వున్నాడు! పక్కన చేతులు కట్టుకొని యినస్పెక్టరు భయంతో వొణికిపోతూ నించొని వున్నాడు!!

కుర్చీలో కూర్చొన్నవ్యక్తి మొహం వాచిపోయి వుంది, రాత్రి వేమయ్యకొట్టిన దెబ్బలకు కళ్లు చింతనిప్పుల్లా మండిపోతున్నాయి. ఇనస్పెక్టరు వేమయ్యకు దగ్గరగావొచ్చి మెల్లిగ అన్నాడు! "యూ. ఫూల్! ఆయనయింటలిజన్స్ బ్రాంచి సర్కిల్ ఇనస్పెక్టర్! కొత్తగా మన సర్కిల్‌కు వచ్చారు."

ఆ మాటల తాలూకు పూర్తి అర్థం వేమయ్య చెవుల్లోంచి మెదడుకు చేరకముందే వేమయ్య నెత్తిమీద యింటి కప్పు విరుచుకుపడ్డట్టయింది!

అంతలోకే, లోపలికివస్తూన్న పోలీసు సూపరింటెండెంటునుచూసి సర్కిల్ ఇనస్పెక్టరు లేచినుంచొని శాల్యూట్ చేశాడు. వెంటనే యినస్పెక్టరూ, శాల్యూట్ చేశాడు. సూపరింటెండెంటును చూసేసరికి వేమయ్యకు పై ప్రాణాలు పైనే పోయాయి. శాల్యూట్ చేయడానికి వేమయ్యకు చెయ్యి కూడా పైకి లేవలేదు పాపం.

సూపరింటెండెంటు కూర్చొని, సర్కిల్ యినస్పెక్టర్నూ, సబ్ యినస్పెక్టర్నూ చూస్తూ చెప్పాడు.

"రాత్రి మా యింట్లో దొంగతనం జరిగింది. నగలూ, వెండిసామానూ, డబ్బూ పోయినై. మా వంటమనిషి, నాలుగు రోజుల్నాడు వచ్చిన దాని కూతురూ, అల్లుడు ఆ ముగ్గురూ తెల్లవారిపాటికి మాయమైనారు."

సర్కిల్ ఇనస్పెక్టరు మధ్యలో అందుకొని రాత్రి జరిగినదంతా చెప్పాడు. అతడు చెప్తూన్నంతసేపూ వేమయ్య లోతు తెలియని అగాధంలోకి పడిపోయాడు! కళ్ళు బైర్లుకమ్ముకుపోతున్నయ్. నోరు యెండిపోతూంది. చెవుల్లోంచి వెచ్చని ఆవిరి వస్తూన్నట్టనిపించింది. వేమయ్య కాళ్ళకింద భూమి కదిలింది.

"యూ! ఇడియట్! గెటవ్‌ట్!" సూపర్నెంటెంటు అరచిన కేకకు వేమయ్య స్టేషన్ బయట పడ్డాడు. వెళ్తూన్న వేమయ్యనుచూచి సబ్ ఇనస్పెక్టరు "ముందా బుట్ట అక్కడ పెట్టి మరీకదులూ!' అన్నాడు.

వేమయ్యా బరువుగా తలమీదనుంచి బుట్టనుతీసి కింద పెట్టాడు. అయినా ఆ బుట్టతాలూకు వొరవడి వేమయ్యా తల చుట్టూ వుండనే వుంది.

కాఖీనిక్కరు జేబులోనుంచి అడ్రసుకార్డు తీసి నడి రోడ్డుమీద పారేశాడు వేమయ్యా. ఆ కార్డుమీద - ఎందుకు లేండి నేచెప్పడం! అసలే కాకలో వున్నాడేమో, వేమయ్యాకు కోపంరావొచ్చు! మీ కంతగా తెలుసుకోవాలనుంటే వేమయ్యానే అడిగి తెలుసుకోండి. వేమయ్యా తలచుట్టూ పోలీసుబుట్టతాలూకూ వరవడి వుంటుంది! అదేగుర్తు, మాజీ హెడ్ కాన్‌స్టేబుల్ వేమయ్యాను కనుక్కోటానికి.